# సత్యవాక్కు

సంపుటి - 41　　ఆగష్టు - 2019　　సంచిక - 1

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

AUGUST - 2019

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

# టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

## సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

Youtube లో satyavanicoc.kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 41 ఆగష్టు - 2019 సంచిక -1


## గొప్ప నిర్ణయములు

### ( Great Decisions )

దేవుని చిత్తము ఇశ్రాయేలీయుల యందు నెరవేరు వరకు యెహోవా దేవుడు వారిని తన కొరకు ఒక ప్రత్యేక జనాంగముగా నెంచుకొనెను. దేవుడు వారి యెడల యెంత కరుణా కటాక్షములు కలిగి యుండినను ఇశ్రాయేలీయులు ఆయన కట్టడల నుండి తొలగిపోవు చుండెడివారు. వారు విగ్రహములను చేసికొని వాటిని పూజింపరాదని దేవుడు వారిని హెచ్చరించినను వారు విగ్రహారాధనను జరిగించి దేవుని ఉగ్రతకు పాలగు చుండెడివారు. అన్య జనాంగములైన మోయాబీయులు, అమ్మోరీయులు మొదలగు వారితో సాంగత్యము చేయరాదని దేవుడు వారిని ఆజ్ఞాపించినను వారాయన మాటలను గైకొనక ఈ అన్యజనాంగము లతో సాంగత్యము చేసిరి. దేవుడు వారిలో కనబడు అట్టి అవిధేయతలను కఠినముగా శిక్షించుచుండినను ఇశ్రాయేలీయులు మారుమనస్సు లేనివారైరి.

మోషే అనేక సంవత్సరములుగా వారికి నాయకునిగా యుండెను. అయితే మోషే తరువాత నూను కుమారుడైన యెహోషువా వారికి నాయకునిగా యుండి దేవుడు వాగ్దానము చేసిన కానాను దేశమునకు ఇశ్రాయేలీయులను నడిపించెను.

ఇశ్రాయేలీయుల మనస్తత్వమును అతడు బాగుగా ఎరిగినవాడై యుండెను. అతడు సజీవుడైన యెహోవా దేవుని గూర్చి వారిని హెచ్చరించుటకును, ఆయనకు వారు యోగ్యమైన పరిచర్య యెట్లు చేయవలెనో తెలియజేయుటకును ఇశ్రాయేలు గోత్రములవారి నందరిని అతడు షెకెమునకు పిలిపించెను.

అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల దేవుడగు యెహోవా వారి యెడల చూపిన కృపను వారికి అతడు జ్ఞాపకము చేసెను. యెహోవా దేవుడు వారిని ఐగుప్తు దేశపు బానిసత్వము నుండి, తమ శత్రువులబారి నుండి ఎట్లు విడిపించెనో వారి కతడు జ్ఞాపకము చేసెను. చివరిగా అతడు వారితో ఇట్లనెను : "కాబట్టి మీరు యెహోవా యందు భయభక్తులు గల వారై ఆయనను నిష్కపటముగాను, సత్యముగాను సేవించుచు, మీ పితరులు నది అద్దరిని ఐగుప్తులో సేవించిన దేవతలను తొలగద్రోసి యెహోవానే సేవించుడి. యెహోవాను సేవించుట మీ దృష్టికి కీడని తోచిన యెడల మీరు ఎవని సేవించెదరో, నది అద్దరిని మీ పితరులు సేవించిన దేవతలను సేవించెదరో, అమోరీయుల దేశమున మీరు నివసించుచున్నారే వారి దేవతలను సేవించెదరో నేడు మీరు కోరుకొనుడి; మీ రెవరిని సేవింప కోరుకొనినను నేనును, నా యింటి వారును యెహోవాను సేవించెదము" (యెహోషువా 24:15,16).

**నేనును నా యింటి వారును**

మీరెవరిని సేవించ నిశ్చయించి నను నేనును నా యింటి వారును యెహోవాను సేవింతుమను గొప్ప నిర్ణయమును యెహోషువా ఇశ్రాయేలీయులకు ఇక్కడ ప్రకటించెను. ఇట్టి నిర్ణయములను గైకొనునప్పుడు బహుశా మనకు రెండే రెండు మార్గములు కనబడవచ్చును, వాటిలో సరియైనదాని నెంచుకొనుటలో మన శరీరాత్మల క్షేమము ఆధారపడి యున్నది. యెహోవాను సేవించుటకు యెహోషువా గైకొనిన నిర్ణయము సరియైనది, గొప్పది. అది యెహోవా దేవుని యందలి నిజమైన విశ్వాస ప్రేమలపై ఆధారపడి యున్నట్టిది.

బైబిలు గ్రంథము, ముఖ్యముగా పాతనిబంధన గ్రంథము అనేక మాదిరులు కలిగినట్టి గ్రంథమై

యున్నది. పాత నిబంధనలో వ్రాయ బడియున్న సంగతులు ఈ యుగాంత మందున్న మనకు బోధకలుగుటకును, బుద్ధి కలుగుటకును వ్రాయబడి యున్నవి (1 కొరింధి 10:11). గనుక ఈ రోజు సరియైన నిర్ణయమును గైకొని దీవించబడినట్టియు, అట్టి నిర్ణయమును గైకొనక శ్రమల ననుభవించిన వారి యొక్కయు బైబిలు ఉదాహరణలను కొన్నిటిని గమనించి వాటి ద్వారా తగిన పాఠమును నేర్చు కొందము.

**అబ్రాహాము నిర్ణయము**

అబ్రాహాము తానున్న ప్రదేశమును, తన బంధువులను వీడి దేవుడు తనకు చూపించు వేరొక ప్రదేశమునకు వెళ్ళవలెనన్నపుడు సరియైన నిర్ణయమును గైకొనెను. తన బంధువులను, స్వగ్రామమును అకస్మాత్తుగా విడిచిపెట్టుట చాల కష్టమైన పనియే. అయితే అబ్రాహాము దేవుని వాక్యమునకు లోబడి తాను స్వాస్థ్యముగా పొందనైయున్న ప్రదేశము నకు బయలువెళ్లెను. మరియు ఎక్కడికి వెళ్ళవలెనో అది ఎరుగక బయలు వెళ్ళెను. అందువలన అతడు బహుగా ఆశీర్వదించ బడెను (హెబ్రీ 11:8-2).

**మోషే**

మోషే తన యౌవన కాలమందే ఒక గొప్ప నిర్ణయమును గైకొనెను. అతడు ఒక రాకుమారునివలె ఐగుప్తు దేశమందు పెరుగుచున్నను ఫరో కుమార్తె యొక్క కుమారుడననిపించు కొనుటకు తిరస్కరించెను. అతడు ఐగుప్తు ధనముకంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని అల్పకాలము పాపభోగము అనుభవిం చుటకంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించెను. ఏలయనగా అతడు ప్రతిఫలముగా కలుగబోవు బహుమానమునందు దృష్టి యుంచెను (హెబ్రీ 11:24-26). మోషే దేవుని ప్రజలకు నాయకుడై, గొప్ప బలిష్టుడైన ఫరోను ఓడించి, వారిని బానిసత్వము నుండి విడిపించెను.

**తప్పిపోయిన కుమారుడు**

క్రొత్త నిబంధనలో మనకు తప్పి పోయిన కుమారుడు గైకొనిన ఒక గొప్ప నిర్ణయము జ్ఞాపకమునకు వచ్చు చున్నది. అతడు పాపములో జీవించు చుండెను. అంతేకాదు తినడానికి తిండి కూడ అతనికి దొరుకకయుండెను. అట్టి పరిస్థితిలో అతడొక నిర్ణయమునకు

రావలసి యున్నది; ఆకలి బాధతో అలమటించి చనిపోవుటా? లేక తాను విడిచివచ్చిన తన తండ్రి యింటికి తిరిగిపోవుటా? యను దానిని అతడు అప్పటికప్పుడు యెంచుకొనవలసి యున్నది. అయితే అతడిట్లు నిర్ణయించెను: "నేను లేచి నా తండ్రి యొద్దకు వెళ్ళి–తండ్రీ, నేను పరలోకమునకు విరోధముగాను నీ యెదుటను పాపము చేసితిని; ఇక మీదట నీ కుమారుడనని అనిపించుటుకొనుటకు యోగ్యుడను కాను; నన్ను నీ కూలివారిలో ఒకనిగా పెట్టుకొనుమని అతనితో చెప్పుదునను కొని, లేచి తండ్రియొద్దకు వచ్చెను" (లూకా 15:19). అతడు తనతండ్రి యొద్దకు రాగానే అతడొక కూలివానిగా కాదు గాని ఒక కుమారునిగానే అంగీకరించబడెను.

**సంశయము పనికిరాదు**

అనేకులు నేడు ఈ తప్పిపోయిన కుమారునివలె పాపములోబడి కూలిపోవుచున్నారు. వారు లేచి యేసుక్రీస్తునొద్దకు వచ్చినయెడల వారు కూడా కుమారులవలె స్వీకరింపబడుదురు. అనేకులు అటుయిటు నిర్ణయించ లేక సంశయిస్తు తమ కాలమును వెళ్ళబుచ్చుదురు. అయితే ఎటూ నిర్ణయించలేనివారి గతి ఘోరమైనదని బైబిలు మనకు బోధించుచున్నది. ఈ సందర్భములో లోతుయొక్క భార్యను జ్ఞాపకము తెచ్చుకొందము. పాపముతో నిండిపోయిన సొదొమ, గొమొఱ్ఱాలను పట్టణముల నుండి ఆమె తన భర్తతోను ఇద్దరు కుమార్తెలతోను బయటపడెను. వెంటనే యెహోవా దేవుడు ఆకాశము నుండి గంధకమును, అగ్నిని కురింపించి ఆ పట్టణములను నాశనము చేసెను. అయితే నీవు వెనుకకు చూడవద్దు అని దేవుడు చెప్పిన మాటను మరచి లోతు భార్య వెనుకకు తిరిగి చూచి ఉప్పుస్తంభమాయెను (ఆది.19 అధ్యా). లోతు భార్య పాపపు పట్టణములను విడుచుటకు సంశయించెను. ప్రాణమును కోల్పోయెను.

**ధనవంతుడు**

యౌవనస్థుడైన ధనికుడొకడు నిత్యజీవమును పొందుటకు నేనేమి చేయవలెను? అని అడుగుచూ యేసునొద్దకు వచ్చెను. నీకు కలిగిన దంతయు అమ్మి బీదలకిమ్ము 'అని యేసు అతనితో చెప్పగా అతడు

మిగుల వ్యసనపడి వెళ్ళిపోయెను. అట్టి ప్రజలు దేవుని రాజ్యములో ప్రవేశించుట దుర్లభమని యేసు చెప్పెను.

**పిలాతు**

పిలాతు యేసుక్రీస్తు నిర్దోషియని ఎరిగియుండియు కూడ క్రీస్తును గూర్చి సరియైన నిర్ణయమును గైకొనలేక పోయెను. సిలువ వేయుటకు ఆయనను జనసమూహముల కతడు అప్పగించెను. అపొస్తులుల కార్యములలో అగ్రిప్ప, ఫేలిక్సు అను యిద్దరు రోమా సామ్రాజ్యపు పాలకులు మనకు కనబడుచున్నారు. అయితే క్రీస్తును గూర్చి, క్రైస్తవ్యమును గూర్చి వారు బాగుగా యెరిగి యుండినను క్రైస్తవులగుటకు వెనుకాడిరి, సంశయించిరి. నీవయితే అట్లు సంశయించక సరియైన నిర్ణయమును గైకొనవలసి యున్నది. మనము అనేక విషయములలో సరియైన నిర్ణయమును గైకొనవలెను. ఒకటి విగ్రహములనుగాక సజీవుడైన దేవుని మాత్రమే సేవింతుమని నిర్ణయించుకొన వలెను.

మనసేవ దేవునికి అంగీకార యోగ్యముగా యుండవలెనన్న మొదటిగా యేసుప్రభువు దేవుని కుమారుడని మనము నమ్మవలెను. మనము ఆయన మార్గములో ఆయన చెప్పినట్లు నడుచుకొనుటకు నిశ్చయించుకొనవలెను. తరువాత మన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను. ఆయన యిచ్చు రక్షణలో ప్రవేశించుటకిది మనము గైకొన వలసిన గొప్ప నిర్ణయము. అటుతరువాత ఆయన నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొని బాప్తిస్మము పొందవలెను.

ప్రతివాడును క్రీస్తు యొక్క ఆజ్ఞలకు లోబడుటకు తానే నిశ్చయించుకొనవలెను. క్రీస్తును వెంబడించుటకు సంశయించువాడు రెండు నావల పై కాళ్ళు వేసికొని నిలబడిన వానివలె యగును. అతడు వెచ్చగానైనను చల్లగానైనను లేక నులివెచ్చని స్థితిలో యున్నవాడగును. అట్టి వానిని తన నోట నుండి ఉమ్మివేతును అని క్రీస్తు చెప్పెను. నీవు యేసుక్రీస్తు అనుగ్రహించు రక్షణను ఉచితముగా పొందవలనంటే, క్రైస్తవుడగుటకు ఈనాడే నిశ్చయించుకొనుము. నీ యింటి వారెవరిని సేవించినసరే, నీవయితే యేసుక్రీస్తుకు లోబడి ఆయనను సేవించుము, నిత్య రక్షణ నీదగును.

# మానవునితో నేడు దేవుడు మాట్లాడుచున్నారా ?

## ( Does God Speak to Man Today ? ) J.C. Choate

బైబిలు నందు పాతనిబంధన మరియు క్రొత్త నిబంధన కలవు. బైబిలు సంపూర్ణమైన దేవుని వాక్యమును, దానియందు దేవుని మాటలు కలిగి ఉన్నదిగా గ్రహించ వలెను. క్రీస్తు సిలువ వేయబడక మునుపు పాతనిబంధన ప్రజలకు దేవుని వాక్యముగా ఉండేది. క్రీస్తు మరణించిన తరువాత క్రొత్త నిబంధన దేవుని వాక్యమై యున్నది. మనము ఏ విధముగా రక్షింపబడాలో, ఏవిధముగా జీవించాలో, ఏవిధముగా పరలోకము నకు వెళ్లగలమో క్రొత్త నిబంధన తెలియ జేస్తుంది.

దేవుడు నేటి మనుష్యునితో మాట్లాడునా? అని మీరు అడగవచ్చు. ఆ ప్రశ్నకు సమాధానం అవును. ముందుగా మనము దేవుడు ఉన్నాడని నమ్ముచున్నాము. ఉనికిలో ఉన్న ప్రతీదీ ఆయన సృజనాత్మక సామర్థ్యానికి నిదర్శనం. ఏమి లేని దాని నుండి ఏది రాదు. నిత్యం దేవుడు ఉన్నాడు "ఆయన భూమ్యాకాశములను సృజించెను" (ఆదికాండం 1:1). అయితే నరుని నిర్మాణం యొక్క ఉద్దేశ్యం ఏమిటంటే అతని సృజించిన దేవుని మహిమపరచడం. క్రొత్త నిబంధనలో మనము ఈ విధముగా చూడగలము. "సకల యుగములలో రాజైయుండి, అక్షయుడును, అదృశ్యు డునగు అద్వితీయ దేవునికి ఘనతయు మహిమయు యుగయుగములు కలుగును గాక" ఆమెన్ (1తిమోతి 1:17). బలవంతముగా దేవునికి విధేయత చూపుట వలన దేవుడు మహిమ పరచబడడు అతడు విధేయత లేదా అవిధేయత ఎంచు కొన వచ్చును. మనుష్యుడు జ్ఞానముతో నిర్ణయము తీసుకొనుటకు దేవుడు అతని ముందు మంచి, చెడు రెండు ఉంచెను. అందువలన దేవుడు తన చిత్తము వివరించుటకు మనుష్యునితో మాట్లాడెను. అలాగుననే పాపము గురించి హెచ్చరించి దాని పర్యవసనాలు తెలిపెను. దేవుడు మనుష్యుని యొక్క నిర్ణయం అతని ఇష్టానికే వదిలేసెను.

దేవుడు మనుష్యునితో

ఎల్లప్పుడు మాట్లాడెను. క్రొత్త నిబంధనలో హెబ్రీ గ్రంధకర్త ఈలాగు చెప్పెను : "పూర్వకాలమందు నానా సమయములలోను, నానావిధములు గాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటాలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను". ఆయన ఆ కుమారుని సమస్తమునకును వారసుని గా నియమించెను" (హెబ్రీ 1:1,2). ఈ వాక్య భాగము నుండి చాలా తెలిసికొన వచ్చును.

ముందుగా దేవుడు నానాసమ యములలో నానా విధములుగా మాట్లాడెనని మనకు తెలియజేస్తుంది. రెండవదిగా దేవుడు పూర్వకాలమందు ను, ఈ దినముల అంతమందును మాట్లాడెనని తెలియ జేస్తుంది. పూర్వకాలమందు పాత నిబంధనలో కనువరచినట్లు దేవుడు మన పితరులతో లేదానేరుగా మాట్లాడేవాడు. వారు ఆయన మాటను వారి కుటుంబా లకు తెలియజేసేవారు. ఉదాహరణకు దేవుడు నోవాహుతోను, అబ్రహాము తోను ఇతరులతో ఆ కాలమందు మాట్లాడెను. అటు తరువాత యిర్మియా, యెషయా, మోషే లాంటి ప్రవక్తల ద్వారా దేవుడు మానవులతో మాటలాడెను. దేవుని యొక్క చిత్తము శాశ్వతముగా ఉంచబడులాగున ప్రజలు చదువులాగున ఈ కాలములో ఆయన వాక్యము వ్రాయబడియున్నది.

చివరిగా దేవుడు ఆయన కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా క్రొత్త నిబంధనలో వెల్లడి పరిచినట్లు మనతో మాట్లాడెను. యేసుక్రీస్తు మరియు ఆయన శిష్యుల సమక్షంలో పరలోకము నుండి దేవుడు ఈలాగు వినిపించెను "ఇదిగో ఈయన నా ప్రియకుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను, ఈయన మట వినుడి" (మత్తయి 17:5). శిష్యుడైన యోహాను ఇలా చెప్పెను "ధర్మశాస్త్రము మోషే ద్వారా అనుగ్రహింపబడెను, కృపయు, సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెను" (యోహాను 1:17).

క్రీస్తు స్వయముగ ఇలాచెప్పెను "ఎవడైనను నా మాటలు వినియు వాటిని గైకొనకుండిన యెడల నేనతనికి తీర్పుతీర్చను; నేను లోకమునకు తీర్పు తీర్చుటకు రాలేదు గాని లోకమును రక్షించుటకే వచ్చితిని". నన్ను

నిరాకరించి నా మాటలను అంగీకరిం పని వానికి తీర్పుతీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్య దినమందు వానికి తీర్పుతీర్చును. ఏలయనగా నా అంతట నేను మాటలాడలేదు; నేను ఏమనవలెనో యేమి మాటలాడవలెనో దానిని గూర్చి నన్ను పంపిన తండ్రియే నాకాజ్ఞ యిచ్చి యున్నాడు. మరియు ఆయన ఆజ్ఞ నిత్య జీవమని నేనెరుగుదును గనుక నేను చెప్పు సంగతులను తండ్రి నాతో చెప్పిన ప్రకారము చెప్పుచున్నాననెను (యోహాను 12:47-50).

దేవుడు ఎల్లప్పుడు మనుష్యుని తో మట్లాడెను అని చెప్పబడి యున్నది. ఏమి తోచని స్థితితో మానవజాతిని అంధకారములో ఆయన ఎప్పుడూ విడిచి పెట్టలేదు. అలాకాకుండా, మనము జ్ఞానవంతమైన నిర్ణయాలు తీసుకొనులాగున ఆయన చిత్తాన్ని తెలియపరచెను.

క్రీస్తు పూర్వము, దేవుడు మానవులతో ఒక నిబంధన చేసెను. తరువాత ఇశ్రాయేలు ప్రజలు దానిని మోషే ధర్మశాస్త్రముగా పిలిచిరి. గలతీ 3:19,24,25 ప్రకారముగా మనము చూచినట్లయితే అలాగైతే ధర్మశాస్త్ర మెందుకు? ఎవనికి ఆ వాగ్దానము చేయబడెనో ఆ సంతానము వచ్చు వరకు అది అతిక్రమములను బట్టి దానికి తరువాత ఇయ్యబడెను..కాబట్టి మనము విశ్వాసమూలమున నీతి మంతులమని తీర్చబడునట్లు క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు ధర్మ శాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడియాయెను గనుక ఇక బాల శిక్షకుని క్రింద ఉండము!

పాత నిబంధనను కొట్టివేయుట కై తన ప్రియకుమారుడైన యేసుక్రీస్తును సిలువ మరణమునకు అప్పగించెను. దేవుడు మనకు క్రొత్తనిబంధన యిచ్చెను. హెబ్రీ 10:9,10లో ఈ విధంగా చూడగలము ఆయన-నీ చిత్తము నెర వేర్చుటకు ఇదిగో నేను వచ్చియున్నానని చెప్పుచున్నాడు. ఇవన్నియు ధర్మశాస్త్ర ము చొప్పున అర్పింపబడు చున్నవి. ఆ రెండవ దానిని స్థిరపరచుటకు మొదటి దానిని కొట్టి వేయుచున్నాడు. యేసుక్రీస్తు యొక్క శరీరము ఒక్క సారియే అర్పింబడుట చేత ఆ చిత్తము ను బట్టి మనము పరిశుద్ధ పరచబడి యున్నాము.

దీనిని బట్టి మనము చూచినట్లే తే క్రీస్తు తనకు తాను సిలువకు అప్ప గించుకొని రెండవ నిబంధనను స్థిర పరచుటకు మొదటి దానిని కొట్టి వేసెను. అది క్రొత్త నిబంధనగా పిలువ బడుచున్నది.

ఎప్పుడైనా మనతో దేవుడు మాట్లాడుతున్నాడా లేదా అనే ఆలోచన పైకి వచ్చినప్పుడు, చాలమంది దేవుడు నేరుగా మనుష్యునితో మాట్లాడే పరంగా ఆలోచిస్తూ వుంటారు. మనకి క్రొత్త నిబంధన రూపంలో దేవుని యొక్క చిత్తము వ్రాయబడి యున్నప్పటికీ, కొంతమంది బైబిలులో ఉండే విధంగా కాకుండా దేవుడు వారికి వినిపించే స్వరములో దర్శనమందు, కలలోను లేదా ఇతర మార్గముల ద్వారా మాట్లడతారని చెప్పడం మనం వింటాము. బైబిలు మనకు అలా చెప్పడం లేదు.

మనము ఈ విషయములు స్పష్టం చేసుకుందాం. దేవుడు మనతో మాట్లాడుతున్నారు, ఆయన కుమారుని ద్వారా మాట్లాడుతున్నారు, క్రీస్తు వాక్యము ద్వారా మాట్లాడుతున్నారు. వాక్యము క్రొత్తనిబంధన రూపంలో భద్రపరచబడియున్నది. కాబట్టి మనము ఎప్పుడైతే క్రొత్తనిబంధనలోని దేవుని వాక్యము చదువుతామో అప్పుడు దేవుడు మనతో మాట్లాడు చున్నాడని మనము గ్రహించాలి. దేవుని వాక్యము జీవమై యున్నది. ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటు వంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను, కీళ్లను, మూలుగను, విభజించు నంతమట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించు చున్నది (హెబ్రీ 4 :12). నీ వాక్యమే సత్యము (యోహాను 17:17).

దేవుని వాక్యము శాశ్వతమగు జీవము కలిగినది (1పేతురు 1:23). "నన్ను నిరాకరించి నామాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చు వాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పుతీర్చును (యోహాను 12:48).

కాబట్టి దేవుని వాక్యము యధా విధిగా ఉంచలెను. మనము ఏదీ జత పరచకూడదు, తీసివేయకూడదు. ఈ గ్రంధమందున్న ప్రవచన వాక్యములను

విను ప్రతివానికి నేను సాక్ష్యమిచ్చునది ఏమనగా ఎవడైనను వీటితో మరి ఏదైనను కలిపినయెడల, ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్ళు దేవుడు వానికి కలుగజేయును. ఎవడైనను ఈ ప్రవచన గ్రంథమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసిన యెడల దేవుడు ఈ గ్రంథములో వ్రాయబడిన జీవవృక్షము లోను పరిశుద్ధ పట్టణములోను వానికి పాలులేకుండ చేయును (ప్రకటన 22: 18,19). దేవుడు ఆయన చిత్తం యావత్తు మనకు బైబి ద్వారా తెలియ పరచెను. కాబట్టి ఎవరైనా దేవుడు తనకి క్రొత్త వర్తమానము తెలియజేసెను అని చెప్పినట్టైతే అతడు మోసపోయినట్లును అలాగే ఇతరులను మోసపరచుటకు ప్రయత్నిస్తున్నట్లును మనము గ్రహించ వలసిన అవసరము ఉంది.

- అనువాదం : లేచెల్ గూటం.

## అపో.కా 8 : 1 - 8 లో మూడు గొప్ప సంఘటనలు

## (Three Great Events in Acts 8 :1-8)

**గొప్ప హింస (అపో.కా. 8:1) :**

"ఆ కాలమందు యెరూషలేము లోని సంఘమునకు గొప్ప హింస కలిగినందున అపొస్తులులు తప్ప అందరు యూదయ సమరయ దేశములయందు చెదరిపోయిరి". యేసును మనము నమ్మకముగా అనుసరించినప్పుడు మనకు హింసకలుగునని ఆయన ముందుగానే మనలను హెచ్చరించారు. అప్పటికే అపొస్తలులు పట్టుబడి, చెరసాలలో వేయబడి, కొట్టబడ్డారు. అట్టి హింస కలుగునని వారు బహుశ శిష్యులకు హెచ్చరికచేసేయుందురు. స్తెఫనును హత్యచేసిన తరువాత క్రీస్తుమార్గము యొక్క విరోధులు మరింత ఉక్రోషముతో రెచ్చిపోయారు. సంఘము చెల్లాచెదురైపోయింది. మనము కూడ క్రీస్తుకు నమ్మకముగా యుంటే మనకు అనేక సమస్యలు ఎదురవుతాయి. మన తదుపరి సమస్యలు ఉద్భవించక ముందే, మరణమును జయించిన మన రక్షకుని యందు మన నిరీక్షణ మరింత బలపరచబడాలి (కొలస్స 3:1-5; తీతు 2:11-13; హెబ్రీ 6:19, 10:23, 1పేతురు 1:3-5, 13, 21).

**గొప్ప ప్రలాపము (అపో.కా. 8:2) :**

"భక్తిగల మనుష్యులు స్తెఫనును

సమాధిచేసి అతనిని గూర్చి బహుగా ప్రలాపించిరి". స్తెఫను యొక్క సమాధి జరుగకముందు లూకా గొప్ప హింసను గూర్చి ముందుగా మనకు ఎందుకు తెలియజేసాడు? అంటే ఈ హింస అకస్మాత్తుగా సంభవించెనని అతడు చెప్పజూచాడు. అంతగొప్ప హింసలో కూడ భక్తిగల క్రైస్తవులు స్తెఫను యొక్క శవమును విడిచి పెట్టి పారిపోలేదు. మరియు వారు స్తెఫనును సమాధి చేసినప్పుడు నిశ్శబ్ధముగా యేమీ అ[illegible]నిచేయలేదు. వారు గొప్పగా ప్రలాపించారు. వారి బహిరంగ ప్రలాపన దుర్మార్గులు చేసిన దుష్క్రియకు నిరసనగాను, హెచ్చరికగాను యుండెను. మన చుట్టూ ఎంతదుర్మార్గత జరుగుచుండినను, మనం మంచిని చేస్తునే యుండాలి. మన జీవితంలో అంధకారము ప్రవేశించునప్పుడెల్లా మన విశ్వాసము మరింత శ్రేష్టముగా ప్రకాశించాలి (మత్తయి 5:13-16).

**గొప్ప సంతోషము (అపొ.కా. 8:4-8):**

"కాబట్టి చెదరిపోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి. అప్పుడు ఫిలిప్పు సమరయపట్టణము వరకును వెళ్లి క్రీస్తు సువార్తను ప్రకటించుచుండెను. జన సమూహములు ఫిలిప్పు చేసిన సూచక క్రియలను చూచినందున అతడు చెప్పిన మాటలయందు ఏకమనస్సుతో లక్ష్యముంచిరి. అనేకులకు పట్టిన అపవిత్రాత్మలు పెద్దకేకలు వేసి వారిని వదలిపోయెను. పక్షవాయువు గలవారును కుంటివారును అనేకులు స్వస్థత నొందిరి, అందుకు ఆ పట్టణములో మిగుల సంతోషము కలిగెను".

దేవుని ప్రేమించువారికి సంభవించు కీడులో నుండి మేలును సమకూర్చుట దేవునికి తెలియును. "దేవుని ప్రేమించు వారికి అనగా ఆయన సంకల్పముచొప్పున పిలువ బడినవారికి మేలు కలుగుటకై సమస్త మును సమకూడి జరుగుచున్నవి" (రోమా 8:28). నమ్మకమైన క్రైస్తవులు క్రొత్తప్రదేశమునకు వెళ్లునప్పుడు వారితో సువార్తను తీసికొని పోవుదురు. సంఘమునకు కలిగిన గొప్ప హింస వలన గొప్ప ప్రలాపము మొదట సంభవించెను. గాని దాని వలన సువార్త వాక్యము అనేక ప్రదేశములకు, ప్రజలకు వెదజల్లబడెను. దానిని ప్రజలు బహుసంతోషముగా అంగీకరించిరి. తద్వారా మిగుల

సంతోషము కలిగెను. సమరయులలో అనేకులు సువార్త వాక్యమువిని విశ్వసించి తమ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి (అపొ. కా. 8:12,13, అపొ.కా. 2:38). దీనికి ముందు వందలాది సంవత్సరములుగా యూదులు, సమరయులు ఒండొరులు ద్వేషించుకొనుచు యుండిరి. అయితే యిప్పుడు క్రీస్తులో వారిద్దరు ఏకమయ్యిరి. గొప్ప శాంతి సమధానము వారికి లభించెను.

-రోయస్ ఫ్రెడరిక్

## నీ వెవరి కొరకు చూచుచున్నావు ?

## ( whom are you looking for ? )

వారొక సింహము కొరకు ఎదురు చూచుచుండిరి గాని ఆయన ఒక గొర్రెపిల్ల వలె రాగా వారాయనను కనుగొన లేకపోయిరి.

వారొక యుద్ధశాలి కొరకు చూచారు గాని ఆయన శాంతి దూత వలె రాగా వారాయనను చూడ లేకపోయిరి.

వారొక రాజు కొరకు ఎదురు చూచారు గాని ఆయన ఒక దాసునివలె రాగా వారాయనను గుర్తించలేదు.

రోమాసామ్రాజ్యము నుండి విడుదల కొరకు వారు కాంక్షించారు గాని ఆయన రోమీయుల సిలువకు అప్పగించుకొన్నారు. వారాయనను చూడలేకపోయారు.

తామేర్పరచుకొనిన మూసలో ఆయన ఇమిడి యుంటాడని వారు తలంచారు గాని ఆయనే ఒక మూస తయారు చేయువాడయ్యారు. వారాయనను గుర్తించలేక పోయిరి.

తమ భౌతికావసరములను తీర్చు వాని కొరకు వారు కాంక్షించారు. గాని ఆయన వారి నిత్య జీవితావసర ములను తీర్చుగోరారు. వారాయనను గుర్తించలేకపోయిరి.

మన పాప పరిహార్ధమై ఒక గొర్రె పిల్ల వలె ఆయన వచ్చారు. నీవాయనను గుర్తించ గలవా?

దేవునికి మానవునికి మధ్య శాంతి నెలకొల్పడానికి ఆయన వచ్చారు. నీవాయనను కనుగొన్నావా?

మానవ జాతికంతకు మాదిరి యగు దాసునిగా ఆయన వచ్చారు, ఆయనను కనుగొన్నావా?

మనము నిజమైన స్వాతంత్ర్యము

కలిగియుండుటకు ఆయన వచ్చారు, నీవాయనను తెలిసి కొన్నావా?

నీకు నిత్యజీవమునిచ్చుట కాయన వచ్చారు, నీవాయనను గుర్తించావా?

నీవు దేనిని వెదకు చున్నావు? సింహామునా? యుద్ధశాలినా? విమోచకునా?

మనము గొర్రెపిల్లకు సమర్పించు కొన్నపుడు సింహాన్ని కలిసి కొంటాము. శాంతిదూతతో ఏకమైన ప్పుడు యుద్ధశాలిని కలిసికొంటాము. దాసునితో కలసి పనిచేసినప్పుడు రాజును కలసికొంటాము. ఆయనకు అప్పగించు కొన్నవారితో నడచినప్పుడు విమోచకుని కలసికొంటాము. నిత్య సంగతులను గూర్చి చింతకలిగినప్పుడు మన భౌతికావసరములు కూడ తీరును.

నీ వనుకున్న మూసలో యేసు పట్టకపోతే ఆ మూసలను తయారు చేయువాని యొద్దకు రమ్ము. ఆయన చిత్తమునకు లోబడుము. అప్పుడు నీ నిత్యజీవితావసరములు తీర్చబడును.

**- గ్లెన్ హిచ్‌కాక్**

# అహంకార దృష్టి

## ( A Proud Look )

"యెహోవాకు అసహ్యములైనవి ఆరు గలవు. ఏడును ఆయనకు అసహ్యములు. అవేవనగా అహంకార దృష్టియు, కల్లలాడు నాలుకయు, నిరపరాధులను చంపు చేతులును, దుర్యోచనలు యోచించు హృదయము ను, కీడుచేయుటకు త్వరపడు పాదము లను, లేనివాటిని పలుకు అబద్ధ సాక్షియు, అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడును". (సామె 6:16-19).

అహంకార దృష్టి గల వానిని దేవుడు అసహ్యించుకొంటారు. "నేను నీ కంటె శ్రేష్టుడను, నీకంటే తెలివి గలవాడను, నీకంటే గొప్పవాడను" అనే తత్వము అహంకారము. "నాశన మునకు ముందు గర్వము నడుచును. పడిపోవుటకు ముందు అహంకారము నడుచును" అని దేవుడు హెచ్చరిం చారు (సామె 16:18).

ఒకని నడవడిని బట్టి అతడు అహంకారియో లేక అణుకువ గలవాడో చెప్పవచ్చును. అహంకార

దృష్టి గలవాడు తనకుగా తన్నుబట్టి, తన ఆస్థిపాస్థులను బట్టి తాను సాధించిన దానిని బట్టి సంతృప్తి జెంది యుండును, మరియు తన్ను గూర్చి గొప్పగా అంచనావేసికొనును.

ప్రార్ధన చేయుటకు దేవాలయ మునకు వెళ్లిన పరిసయ్యుని, సుంకరిని ఒకసారి జ్ఞాపకము చేసికొనుము. "పరిసయ్యుడు నిలబడి దేవా నేను చోరులును, అన్యాయస్థులను, వ్యభిచారులైన యితర మనుష్యులవలె నైనను, ఈ సుంకరివలెనైనను ఉండ నందుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించు చున్నాను. వారమునకు రెండుమారులు ఉప వాసము చేయుచు నా సంపాదన అంతటిలో పదియవవంతు చెల్లించు చున్నానని" ప్రార్ధించుచుండెను. "అయితే సుంకరి దూరమున నిలుచుండి, ఆకాశము వైపు కన్ను లెత్తుటకైనను ధైర్యము చాలక రొమ్ము కొట్టుకొనుచు దేవా పాపినైన నన్ను కరుణించుమని పలికెను" అతని కంటె ఇతడు నీతిమంతుడుగా తీర్చబడి తన యింటికి వెళ్లెనని యేసు చెప్పారు. తన్ను తాను హెచ్చించు కొనువాడు తగ్గింపబడుననియు తన్ను తాను తగ్గించు కొనువాడు హెచ్చింపబడు ననియు ఆయన చెప్పెను (లూకా 18:10-14).

రెండు సమస్యలున్నాయి : ఒక్క తలాంతు గలవాడు తాను పది తలాంతులుగల వానిననియు, పది తలాంతులు గలవాడు తాను ఒక్క తలాంతు గలవానిననియు తలంతురు. మనము స్వస్థబుద్ధి గలవారమై యుండాలని దేవుని వాక్యము బోధించు చున్నది (తీతు 2:15).

తన్ను తాను ఎంచుకొన దాని కంటే హెచ్చుగా గాని తక్కువగా గాని మనం ఆలోచించుకొనకూడదు (రోమా 12:3). వీటిలో విపరీత ధోరణి వలన సమస్యలుద్భవించును.

మానవుని అహంను రెచ్చ గొట్టుట వలన అతడు పాపములో పడెను (ఆది.కా. 3:4-6). మన అహంకారమును అణగద్రొక్కుట వలన మాత్రమే రక్షణ సాధ్యమగును. "నీ దాసుడు ఆలకించు చున్నాడు, ప్రభువా సెలవిమ్ము" అని మనం వినయముతో చెప్పగలిగి యుండాలి

(1 సమూ 3:10). నయమాను తన అహంకారమును అణచి వేసుకొంటేనే గాని తన కుష్టరోగము నుండి శుద్ధుడు కాలేకపోయెను (2 రాజులు 5: 13,14). అట్లే మనము కూడాను. ప్రభువా నీ చిత్తమే సిద్ధించును గాక యని చెప్పగలిగి యుండాలి.

మనం యేసు యొక్క దాసులమై ఆయన మాదిరి ననుకరించాలి. అహంకార దృష్టిగల వానిని దేవుడు అసహ్యించు కొంటార నునది విదితమే. జీవపు డంభము వలన అనేకులు నాశనమునకు గురి యయ్యారు (1 యోహాను 2:16; ఆది. కా.3:6). అహంకారము దుష్టత్వము. అది లోపలి నుండి ఉద్భవించును. అపవిత్రపరచును (మార్కు 7:21-23). గర్వము వలన ఎదోమీయులు నాశనమయ్యారు (ఓబద్యా 1:1-4). అది ఐగుప్తు అధిపతియగు ఫరోను నాశనం చేసేసింది (నిర్గమ 14:13). అహంకార దృష్టివలన ప్రభువు మార్గము యెడల అంధులగుతారు. గర్వాంధకారము వలన నెబుకద్నెజరు నాశనమయ్యాడు (దానియేలు 3:15, 4:28-30). గర్వము మోసము చేయును, నాశనము గావించును. అందరినీ ప్రేమించు దేవుడు, అందరూ రక్షింపబడాలని కోరు దేవుడు ఇంతమంది గర్వముచే నాశనమగుట చూచి బహుగా దు:ఖించును. ఈ పాపమునకు మనము బలి కాకుందుము గాక.

మనం దీనమనస్సు కలిగి యుండాలని దేవుడు కోరుచున్నారు (రోమా 12:13; యాకోబు 4:6-10). పేతురు వినయము గలవాడయ్యాడు (అపో.కా.10:25,26). పౌలు బర్నబాలు వినయమును ప్రదర్శించారు (అపొ.కా. 14:11-15). ప్రకటన గ్రంథములో దేవుని దూత వినయము కలిగియున్నాడు (ప్రకటన 19: 10 - 10; 22:8,9). దేవుని అద్వితీయ కుమారడగు యేసు వినయ విధేయు లకు పరిపూర్ణ మాదిరియై యున్నారు (హెబ్రీ 5:8-10). మనమందరము ఆయన వలె యుండుటకు దేవుడు సహాయము చేయును గాక!

**- జేమ్స్ విల్‌కట**

# భక్తి మార్గము
## ( The Religious Way )

ప్రపంచములో అనేక మతము లున్నవి. అవన్నియు క్రీస్తు మార్గములు కావు. యాకోబు 1:26లో వ్యర్థమైన భక్తిని గూర్చి చూడగలము. యకోబు 1:27లో నిష్కళంకమైన భక్తి ఏదో చెప్ప బడినది. భక్తి యనగా ఏదో మనకు సంక్రమించునది కాదు గాని, ప్రభువు అధికారమునకులోనై మనము చేయు పనులే. పౌలుగా మారక పూర్వము పౌలు యూద మతస్థుడై చాల భక్తి గలవాడను అనుకొనెను. క్రైస్తవులను హింసించ మొదలు పెట్టెను (అపొ.కా. 23:5, గలతీ 1:13). నిజమైన భక్తికి మంచిక్రియలు అవసరము (యాకోబు 1:27, మత్తయి 7:24-28, ఎఫెసీ 2:10). భక్తిగలవారము అని అనుకొను చున్న అనేక మతస్థులు చివరకు నిరాశ చెందుదురని వ్రాయబడి యున్నది. అట్టి నిరాశ చెందువారు క్రైస్తవులలో కూడా వుందురు (మత్తయి 7:20-24, 25:31-46). మనుష్యుడు ఎంత ఆసక్తిగలవాడైనను ఎంత నమ్మకస్థుడై నను, తమ స్వనీతిని నిజమైన భక్తిగా తలంచరాదు (రోమా 10:1-5). ఆత్మలను రక్షించుటకు శక్తిగల దేవుని వాక్యము మనలను భక్తి మార్గములో నడిపించగలదు (మత్తయి 4:4, యాకోబు 1:21-24). విశ్వాసము క్రియలను అనుసరించు భక్తి మార్గము (మతము) మంచి ఫలములు ఫలించు ను (గలతీ 5:22-25) మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపరచకుండ, వాక్య ప్రకారము చేయువారునై యుండుడి (యాకోబు 1:22). మొదటిగా విశ్వాసము అవసరము (యోహాను 3:16, హెబ్రీ 11:6). క్రియలు లేని విశ్వాసము మృతము (యాకోబు 2:20). సువార్తకు విధేయులగుట అన్నిటికంటె ముఖ్యము (హెబ్రీ 5:9). అనేకులు తమ మనస్సాక్షికి నచ్చినదే మంచి మతము అనుకొనుచున్నారు. అట్టి వారందరు బైబిలు తెలుపుచున్న ప్రకారము వ్యర్థ భక్తి గలావారే.

**బి. ఆనందరావు,**
**గుడిపూడి-6301403850**

# గొర్రెల దొడ్డిని గూర్చిన ఉపమానము

## ( Parable of the Sheepfold )

(యోహాను 10:1-18, 26,27)

పరిచయము :

1. గొర్రెల దొడ్డిని గూర్చిన ఉపమానము రైతుజీవనమును గూర్చి చెప్పును.

ఎ. యేసు చెప్పిన అనేక ఉపమానములు, వ్యవసాయమును గూర్చి యున్నవి. విత్తువాడు, విత్తనము, గోదుమలు గురుగులు, ఆవగింజ, నిష్ఫలమైన అంజూరపుచెట్టు, ద్రాక్షతోట, ద్రాక్షతోటలో పనివారు మొదలగునవి.

బి. గొర్రెల దొడ్డిని గూర్చి చెప్పబడిన ఉపమానము గొర్రెల పెంపకమును గూర్చినది కాదు.

సి. గాని దైవిక సత్యమును బోధించుటకు ప్రజలెరిగిన ఉదాహరణగా ఆయన వినియోగించెను.

2. గొర్రెల దొడ్డిని గూర్చిన ఉపమానము పాలస్తీనాలో గొర్రెలు పెంచుటలోయున్న కొన్ని ముఖ్య సంగతులను కూడ తెలియజేయును.

ఎ. రాత్రివేళ గొర్రెలు ఒక దొడ్డిలో ఉంచబడేవి. మరియు గొర్రెల కాపరి దాని గుమ్మము దగ్గర పండుకొనే వాడు. తద్వారా గొర్రెలు బయటికి పోవాలని ప్రయత్నించుచున్నా లేక దొంగలెవరు వచ్చినా వానికి తెలియును.

బి. ప్రతిగొర్రెకు ఒక పేరు పెట్టబడేది. కాపరి వాటిని, అవి కాపరిని ఎరుగును.

సి. గొర్రెలు గొర్రెల కాపరి శబ్దమును గురుతు పట్టేవి.

డి. పగటివేళ మేతమేయుటకు బయటికి అతడు వాటిని తీసికొని వెళ్లేవాడు.

3. అపొ.పౌలు పేతురు కూడ ఆత్మీయ సత్యములు బోధించుటకు గొర్రెల కావరులను ఉదాహరణగా ఉపయోగించారు.

ఎ. పెద్దలు తాము పరిచర్యచేయు స్థానిక సంఘమునకు కాపరులని పౌలు బోధించాడు (అపొ.కా.20:28).

బి. పేతురు కూడ అదే బోధించి యేసు క్రీస్తును ప్రధాన కావరిగా వర్ణించాడు (1పేతురు 5:1-4).

**1. 1-6 వచనములు**

ఎ. 1. వచనము

1. గొర్రెల దొడ్డి ద్వారము ద్వారా గాక వేరొక మార్గమున దొడ్డిలోనికి ప్రవేశించు ప్రతి ప్రయత్నము, అక్రమమైనది.

2. క్రీస్తు యొక్క మందలో చేర్చబడ వలెనంటే, దాని ద్వారము, కాపరి యైన ఆయన ద్వారానే ప్రవేశింప వలెను.

3. ప్రభువుమందలోనికి వేరే విధముగా ప్రవేశించాలంటే అది అక్రమము, బైబిలు విరుద్ధము.

బి. 1. యేసుక్రీస్తు నిజమైన నాయకుడు, ప్రవక్త, అందువలన ఆయన ద్వారము గుండా ప్రవేశించును (2వ)

2. మిగతా వారందరును దొంగ ప్రవక్తలు (1యోహాను 4:1).

సి. 1. ద్వారపాలకుడు ఒక కాపలా దారుడు. గుమ్మము కాయవాడు.

2. బాప్తిస్మమిచ్చు యోహాను ముఖ్యము గా ఒక ద్వారపాలకుడు. అతడు యేసుక్రీస్తును గొర్రెల కాపరిగా గుర్తించాడు (మత్తయి 3:3, యోహాను 1:29-34).

3. నిజమైన కాపరిని గొర్రెలు ఎట్లు గుర్తించునో, అట్లే దేవుని ప్రజలు అసత్యకాపరుల వలన అబద్ధ ప్రవక్తల వలన మోసగించబడరు.

4. మన కాపరి తన గొర్రెలను పేరు పెట్టిపిలుచును (యెషయా 62:2; అపో. 11:26). దానిలోనికి మేకలకు ప్రవేశములేదు (మత్తయి 25:31-46).

5. కాపరి గొర్రెలను ఎట్లు నడిపించునో, అట్లే యేసుక్రీస్తు తనను వెంబడించా లని ఎవరినీ బలవంతము చేయరు. గాని ఆయనను వెంబడించాలని అందరినీ ఆహ్వానించును (మత్తయి 11:28-30).

డి. 1. కాపరి యొక్క స్వరమును బట్టి వెంబడించుట ఎంతముఖ్యమో అసత్య కాపరి యొక్క స్వరమును వినకుండా యుండుట కూడ అంతే ముఖ్యము (5వచనము).

2. నిజమైన క్రైస్తవులు అబద్ధ క్రీస్తు వలన, అబద్ధ బోధకుల వలన మోసగించబడరు (మత్తయి 24:23 -37, ప్రకటన 1:7)

ఇ. 1. ఆత్మీయ జ్ఞానమును ఉపమాన ములు వృద్ధిచేయును.

2. ఈ ఉపమానమును విన్నవారు దానిలోని ఆత్మీయసత్యమును గ్రహించుకొనలేదు. గాని ఆ ఉప మానము వాస్తవమని అంగీకరించారు.

3. గనుక యేసుక్రీస్తు ఆ ఉపమానము ను వివరించినప్పుడు, దానిని వినిన వారు దానిలోని ఆత్మీయ ఉపదేశమును గ్రహించారు.

**2. 7-10 వచనములు.**

ఎ. 1. కాపరిని దాటుకొని గొర్రెల దొడ్డి లోనికి ప్రవేశించురీతిగా ప్రధాన కాపరియైన యేసుక్రీస్తు యొక్క ఎరుకలో మనము దొడ్డిలో ప్రవేశింతుము.

2. మొదటి శతాబ్ధపు యూదులు యూదా మతమును విడిచి క్రీస్తు లోనికి క్రీస్తుద్వారా ప్రవేశింపవలసి వచ్చెను.

3. నేడున్న మంచిచెడ్డల నెరిగిన ప్రతి వాడు ఈ పాపపు లోకము నుండి క్రీస్తు ఇచ్చురక్షణలోనికి ప్రవేశించా లంటే క్రీస్తుద్వారానే ప్రవేశించును.

బి. 1. మిగతా ద్వారములు, ప్రవక్తలు, మెస్సీయలు, మతనాయకులు అందరు అసత్యనాయకులు (అపో. కా 4:12) (8వచనము).

2. తెలివి గల గొర్రెలు కాపరికి, కాపరులుగా నటించేవారికి యున్న వ్యత్యాసమును గ్రహింతురు.

3. సంఘము స్థాపించబడిన మొదటి పదిసంవత్సరములలోను, క్రైస్తవులుగా మారిన యూదులతో సంఘము సమకూడినది. పాతనిబంధన ప్రవచనములను గుర్తించి వారు క్రీస్తు సంఘములో చేర్చబడిరి.

సి. 1. రక్షణకు యేసుక్రీస్తే ఆధారము. ఇంకొక చోట ఎక్కడా రక్షణ లేదు.

2. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందితే రక్షణ సాధ్యమగును (రోమా 6:3, గలతీ 3:27, 2తిమో 2:10)

3. పచ్చిక, సంఘములో యుండువారు అనుభవించే ఆశీర్వాదములు (ఎఫెసీ 1:3).

డి. 1. మొదటి శతాబ్ధపు పాలస్తీనాలో పరిసయ్యులు, సద్దూకయ్యులు, సమాజ మందిరము వారు అవినీతి పరులైన నాయకులు (10వచ).

**3. 11-18 వచనములు :**

ఎ. 11వ వచనము గొర్రెల కొరకు ప్రాణమును పెట్టు కాపరిగా యేసు క్రీస్తు ఇష్టపూర్వకముగా తన ప్రాణమును బలియిచ్చెను (1 తిమో 2:6).

2. మన కాపరియైన యేసుక్రీస్తు నమ్మదగినవాడు.

బి. మన రక్షకునిగా యేసుక్రీస్తు పై ఆధారపడగలము (12-14వచ)

2. విరోధిచేతిలో పడకుండా యేసు

క్రీస్తు మనలను కాపాడును.

సి. మన కాపరియైన యేసుక్రీస్తును ఆయన మందయైన మనము ఆయనను బాగుగా ఎరుగుదుము (14వచ)

2. ఆయన మందలోని గొర్రెల పేరుల జీవగ్రంథములో వ్రాయబడి యున్నవి (ప్రక 20:12-15).

డి. మన కాపరియైన యేసు ద్వారా పరలోక తండ్రితో సంబంధము కలిగి యున్నాము (15వచ)

2. గొర్రెల కాపరి వాటికొరకు తన ప్రాణమును పెట్టుట అతిశ్రేష్టమైన త్యాగము

ఇ. 16 వచనము డినామినేషన్లను గూర్చినది కాదు.

2. నిజానికి క్రీస్తు సంఘములో అన్యులు కూడా చేర్చబడుదురని యేసు యూదులకు తెలియజేసారు. సంఘ స్థాపన జరిగిన పది సం॥ల తరువాత యిది జరిగెను (యెషయా 62:2, అపొ.10,11 అధ్యా)

3. యేసుక్రీస్తు యూదులను అన్య జనులను తన సంఘములో ఏకము చేసారు (ఎఫెసీ 2:11-22).

4. క్రీస్తు సంఘము ఒకే ఒక్క గొర్రెల దొడ్డి, ఒకే ఒక్క శరీరము (ఎఫెసీ 4:4, 1:22,23, కొలస్స 1:18).

ఎఫ్. 17-18 వచనములలో యేసు యొక్క దైవత్వము కనబడును.

2. దేవుడే యేసుక్రీస్తు రూపమున మన కొరకు బలియాగము చేయుటకు స్వయముగా వచ్చారు. మన కొరకు తన ప్రాణమును బలిగా యిచ్చారు (యోహాను1:17, 2కొరింధి 5:21).

ముగింపు :

1. ఒకే ఒక్క కాపరి, ఒకే ఒక్క గొర్రెల దొడ్డి ఇప్పుడున్నవి.

2. ఆ ఒకే దొడ్డిలో అన్ని జనాంగములు వున్నారు (రోమా 1:11).

3. ఆ దొడ్డిలో మానవ కల్పిత మత శాఖలు, సంఘములు, సభ్యులు లేరు (మత్తయి 15:13).

4. యేసుక్రీస్తు ఒక్కడే మందకు కాపరియై యున్నారు.

ఎ. రక్షింపబడినవారిని ఆయన తన మందలో (సంఘముతో) చేర్చును.

బి. క్రీస్తులో యున్నవారే రక్షింపబడిన వారు (రోమా 6:3, గలతీ 3:27).

సి. క్రీస్తుకు వెలుపల యున్నవారందరు నశించినవారే.

**లూయిస్ రష్మోం**

## సంక్షిప్త వార్తలు

మీ చేతిలో యున్న 2019 ఆగష్టు నెల సంచికతో సత్యవాక్కు 41వ సంవత్సరములో అడుగిడినదని తెలియజేయుటకు ఎంతో సంతోషించుచున్నాము. గత 41 సంవత్సరములలోను ఈ పత్రిక ముద్రణ గాని, ప్రచురణ గాని ఏ మాసములోను ప్రచురపరచబడకుండా యుండలేదు. ప్రతినెలా నిర్ణీత సమయములో యిది ప్రచురింపబడుచున్నది. ఆదిలో 800 మంది సభ్యులతో ప్రారంభించబడిన ఈ పత్రిక ఇప్పుడు ఇంచుమించు 10500 మందికి పోస్టు ద్వారాను, మిగతా 2500 మందికి వ్యక్తిగతముగా గాని, లేదా బండిల్స్ ద్వారా గాని ప్రతినెలా యిది పంపబడుచున్నది.

ఈ పత్రిక ద్వారా అనేకమంది ఆత్మీయముగా బలపడుచున్నారని, సత్యవాక్యమును ఉన్నది ఉన్నట్లుగా ప్రచారము చేయుచున్నారని పలువురు వ్యక్తులు మాకు తెలియజేయుచున్నారు. భారతీయ సహోదరులు తమ వ్యాసములు, ప్రసంగములు మాకు పంపినయెడల యోగ్యమైనవైతే వాటిని తప్పక సత్యవాక్కులో ప్రచురించగలము.

2019 జూలై 15వ తేదీనాడు అమెరికాలో టెక్సాస్ రాష్ట్రము నుండి ఇద్దరు సహోదరీలు భారతదేశ పర్యటన నిమిత్తమై వచ్చి కాకినాడలో కొన్ని దినములు తమ సమయమును గడిపిరి.

రిక్కీగూటం గారు నిర్వహించుచున్న చిల్డ్రన్ హోమ్‌లో యున్న బాలబాలికలతో ఎక్కువ సమయమును గడుపుచు అమెరికాలోయున్న క్రీస్తుసంఘమును గూర్చి అక్కడయున్న యువకులను గూర్చి, సంస్కృతిని గూర్చి వారికి తెలియజేస్తూ సంతోషముగా తమ కాలమును గడిపిరి.

మరియు భారతదేశ పట్టణ పల్లెల వాతావరణమును, జీవనశైలిని తెలిసికొనునిమిత్తము వీరు అనేక పట్టణ, పల్లెప్రాంతములు దర్శించిరి. ఎక్కడకు వెళ్లినా వారికి ఘనస్వాగతము లభించెను. వారు జూలై 29వ తేదీ సోమవారం సాయంత్రం బయలుదేరి హైదరాబాదుమీదుగా తమ స్వదేశమునకు చేరుకొనిరి.

2019 ఆగష్టు 8,9 తేదీలలో కాకినాడలో యువకుల రిట్రీట్ ఘనముగా నిర్వహించబడును. అందునిమిత్తమై రిక్కీగూటం గారు అన్ని ఏర్పాట్లు చేయుచున్నారు. యువకులకు బైబిలుక్లాసులు, బైబిలు క్విజ్‌లు వగయిరా నిర్వహించబడును. అందరికంటె ఎక్కువ లేఖనములను కంఠోపాఠముగా చెప్పు వారికి ఖరీదైన బహుమతులు ఇయ్యబడును. ఆరెండు రోజులలోను ఉచిత భోజన వసతులు అందరికి కల్పించబడును. గనుక మీ సంఘములలోని యువతీ, యువకులను **"బాలకుల నుండి పాలకులయ్యే వరకు"** అను ఈ కార్యక్రమముకు తప్పక పంపించండి.

**RIN Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2018-2020**

From :
SATYAVAKKU
P.O. Box 80, Kakinada - 533001

Date of Publication : 9th of Every Month
Date of Posting : 15th of Every Month

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004